నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, సోమవారం 14 అక్టోబర్ 2024 | KHAMMAM

మణుగూరు సింగరేణి వేడుకల్లో రావణ సంహార ఘట్టం

పారువేటకు వస్తున్న నృసింహస్వామి

రావణ దహన ఘట్టంలో దగ్ధమవుతున్న పటం

దసరోత్సవం

ఆనందోత్సాహాలతో విజయదశమి పర్వం
శమీ శ్లోకం, జమ్మిచెట్టు పూజలతో భక్తగణం
స్వామివారు, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు
ఖమ్మంలో కనుల పండువగా 'పారువేట'
భక్తులతో కిటకిటలాడిన 'జమ్మిబండ' ప్రాంతం
భద్రాద్రిలో వైభవంగా శ్రీరామ్‌లీలా ఉత్సవం

ఖమ్మం/ భద్రాచలం/ పర్ణశాల, అక్టోబర్ 13: 'శమీ శమీయతే పాపం.. శమీ శత్రు వినాశనం.. అర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియదర్శినీ..' అనే శమీ శ్లోకం వాడవాడలా మిన్నంటింది. సర్వజనులకు సకల విజయాలు అందించే జగన్మాతను దర్శించిన భక్తజనం పులకించిపోయింది. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేసిన ముగ్గురమ్మల మూలపుటమ్మను తనివి తీరా వీక్షించిన వారంతా 'జయహో జగన్మాత' అంటూ కీర్తించారు. శమీ శ్లోకం, జమ్మి చెట్టు, స్వామి అమ్మవార్ల పూజలతో ఉమ్మడి జిల్లా అంతటా దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. విజయదశమి వేడుకలను ఉమ్మడి జిల్లా ప్రజలు శనివారం అత్యంత వైభవంగా జరుపుకున్నారు. దసరా పండుగ సందర్భంగా ఖమ్మం నగరంలోని జమ్మిబండ జనసంద్రమైంది. శ్రీరాజరాజేశ్వరదేవి, శ్రీనృసింహస్వామి ఇరువురు ఏకకాలంలో భక్తులకు దర్శనమివ్వడంతో భక్తకోటి భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. విజయదశమి పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సంబురాలు అంబరాన్నంటాయి. ఉదయం నుంచే ఇంటిల్లిపాదీ కలిసి దసరా వేడుకల్లో మునిగిపోయారు. ఆయుధ పూజకు ప్రతీకగా భావించే విజయదశమి రోజున వ్యాపారులు, వాహనదారులు, రైతులతోపాటు సకల జనులు దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామగ్రామాన ప్రజలందరూ కలిసి జమ్మిచెట్టుకు పూజలు చేశారు. శమీశ్లోకంతోపాటు తమ గోత్రనామాలతో కుటుంబ సభ్యుల పేర్లను, తమ మనసులోని కోరికలను కాగితాలపై రాసి శమీవృక్షానికి వేలాడదీశారు. ఖమ్మంలోని శ్రీస్తంభాద్రి లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం సహా పలు దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

పరవశించిన పారువేట.. కిక్కిరిసిన జమ్మిబండ..

ఖమ్మంలోని పారువేట స్థలమైన జమ్మిబండ ప్రాంతం జనసంద్రమైంది. విద్యుత్‌దీపాల కాంతులతో దేదీప్యమానంగా వెలుగొందిన జమ్మిబండ.. వేలాదిమంది భక్తులతో కిటకిటలాడింది. సర్వాంగ సుందరంగా ముస్తాబైన జమ్మిబండ వద్ద ఓవైపు శ్రీరాజరాజేశ్వరి అలంకారంలో అమ్మవారు, మరోవైపు వేదికపై స్తంభాద్రి గుట్ట శ్రీనృసింహాస్వామి ఉత్సవమూర్తి ఏకకాలంలో దర్శనమివ్వడంతో భక్తులు పులకించిపోయారు. అంతకుముందు స్తంభాద్రి ఆలయం నుంచి మేళతాళాలు, వేదమంత్రోచ్చారణాలతో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు స్వామివారిని జమ్మిబండ వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేక వేదికపై ఆలయ ప్రధాన అర్చకులు.. స్వామివారిని శాస్త్రోక్తంగా కొలువుంచి ప్రత్యేక పూజలు చేశారు.

భద్రాద్రి ఆలయ ఈవో రమాదేవి సంధిస్తున్న బాణాన్ని ఖమ్మంలో...

- **భద్రాద్రిలో ముగిసిన శ్రీరామ పారాయణోత్సవం**
- **మహాలక్ష్మీ అలంకారంలో అమ్మవారి దర్శనం**

శ్రీసీతారామచంద్రస్వామికి మహాపట్టాభిషేకం

భద్రాద్రి ఆలయంలో సీతారామచంద్రస్వామి వారికి పట్టాభిషేకం జరిపిస్తున్న అర్చకులు

భద్రాచలం, అక్టోబర్ 13: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో విజయదశమి సందర్భంగా శనివారం శమీపూజను వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తుల ఆయుధాలను మేళతాళాలతో దసరా మండపానికి తీసుకొచ్చారు. అనంతరం శమీపూజ భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. దసరా సందర్భంగా ఆలయంలో శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారు ఉదయం మహాలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామివారికి శ్రీరామ మహా పట్టాభిషేకం నిర్వహించారు. ముందుగా నిత్యకల్యాణాన్ని నిర్వహించారు. తరువాత శ్రీరామాయణ పారాయణ సమాప్తి సందర్భంగా శ్రీరామహా పట్టాభిషేకాన్ని వైదిక సిబ్బంది నిర్వహించారు. అదేవిధంగా దసరాను పురస్కరించుకొని పది రోజులపాటు శ్రీరామాయణ పారాయణం నిర్వహించే సమయంలో నిత్యహోమం నిర్వహించగా.. చివరి రోజున పూర్ణాహుతి గావించారు.

సంప్రదాయబద్ధంగా శమీపూజ

శ్రీ సీతారామచంద్రస్వామి వారికి మహారాజ అలంకారం చేశారు. భాజభజంత్రీలు, మేళతాళాలతో విజయోత్సవం, శమీపూజ కోసం స్థానిక దసరా మండపం వద్దకు తీసుకొచ్చారు. శమీ వృక్షానికి పూజా కార్యక్రమాలు నిర్వహించిన తరువాత సుదర్శనం, ఖడ్గం, ధనస్సు గద తదితర ఆయుధాలకు పూజలు చేసి ఉద్వాసన పలికారు. చివరగా ఇంద్రుడు, యముడు, వరుణుడు, కుబేరునకు ఆవాహనం చేసి బాణాలు సంధించారు. ఈ సందర్భంగా జమ్మి పత్రాలు అక్షింతలతో అర్చన చేసి చివరగా వాటిని భక్తుల శిరస్సుపై చల్లారు. అనంతరం శ్రీరామ్ లీలా మహోత్సవాన్ని నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. ఈ సమయంలో రావణాసుర బొమ్మపై దేవస్థాన ఈవో ఎల్.రమాదేవి బాణాన్ని సంధించారు. చివరగా స్వామివారిని రామాలయానికి తీసుకొచ్చారు అలాగే, పర్ణశాల శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలోనూ విజయదశమి ఉత్సవాలు వైభవంగా జరిగాయి.

ఇల్లెందు రూరల్: మైసూరు తరహాలో ఇల్లెందు జేకే కాలనీలోని సింగరేణి గ్రౌండ్స్‌లో జరిగే వేడుకలకు భారీగా హాజరైన ప్రజలు

మణుగూరు టౌన్: సింగరేణి పీవీ కాలనీలో..

కొత్తగూడెం టౌన్: దసరా వేడుకల్లో పాల్గొన్న భక్తులు

అశ్వారావుపేట రూరల్: పూజలు చేస్తున్న మహిళలు

భద్రాచలంలోని దసరా మండపం వద్ద శమీపూజ జరిపిస్తున్న భద్రాద్రి దేవస్థాన వైదిక సిబ్బంది, తిలకిస్తున్న భక్తులు

ఖమ్మం జమ్మిబండ పారువేట వద్ద భక్తులు

భట్టి సభ వెలవెల

- **'పేట' పామాయిల్ ఫ్యాక్టరీలో విద్యుదుత్పత్తి కేంద్రం ప్రారంభం**
- **పండుగ పూట ఉదయం తొమ్మిది గంటలకే రైతులను తరలించిన రాష్ట్ర ప్రభుత్వం**
- **మధ్యాహ్నం 12, 1, 2 గంటల తర్వాత వచ్చిన మంత్రులు తుమ్మల, పొంగులేటి, భట్టి**
- **2:15 దాటినా భోజనాలు ఏర్పాటు చేయని మంత్రులు**
- **ఆగ్రహించిన అన్నదాతలు.. భోజనాల తర్వాతే సమావేశమన్న 'భట్టి'**
- **ఆ తరువాత అసహనంతో ఇళ్లకు వెళ్లిపోయిన కర్షకులు.. తోడైన వర్షం**
- **ఖాళీ కుర్చీలకే ప్రసంగాలు వినిపించిన ఉప ముఖ్యమంత్రి, మంత్రులు**

డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతుండగా ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

అశ్వారావుపేట, అక్టోబర్ 13: దసరా పండుగ రోజున కుటుంబంతో సంతోషంగా గడుపుదామనుకున్న అన్నదాతలను అనేక ఇక్కట్లకు గురిచేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. విద్య, ఉపాధి నిమిత్తం దూర ప్రాంతాల్లో ఉంటున్న కొడుకులు, బిడ్డలు, అల్లుళ్లు విజయదశమికి ఇంటికొస్తే.. తీరా అదే రోజున సమావేశమంటూ అన్నదాతలను పిలుచుకెళ్లిన ప్రభుత్వం.. వారికి ఆనందం లేకుండా చేసింది. ఆపై ఆకలితో అలమటింపజేసింది. దీంతో విసుగుచెందిన కర్షకులు.. సాక్షాత్తూ ఉప ముఖ్యమంత్రి, మంత్రులు ప్రసంగిస్తుండగానే ఇళ్లకు వెళ్లిపోయారు. దీంతో ఖాళీ కుర్చీలకే ప్రసంగాలు వినిపించుకోవాల్సిన దుస్థితి ఉమ్మడి ఖమ్మం మంత్రులకు ఏర్పడింది.

భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట ఆయిల్‌పాం ఫ్యాక్టరీలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజయదశమి రోజైన శనివారం ప్రారంభించారు. ఆయిల్‌పాం సాగుపై అవగాహన సదస్సు పేరిట ఈ కార్యక్రమం కోసం భద్రాద్రి, ఖమ్మం జిల్లాల రైతులను అధికారులు తరలించారు. ఉదయం 10 గంటలకే మంత్రులు సదస్సును ప్రారంభిస్తారంటూ చెప్పిన అధికారులు.. అంతకు కొన్ని గంటల ముందే రైతులను సభా ప్రాంగణానికి తీసుకొచ్చారు. కానీ మధ్యాహ్నం వరకూ సభ ప్రారంభం కాకపోవడంతో అన్నదాతలకు గంటల తరబడి నిరీక్షణ తప్పలేదు. మధ్యాహ్నం 12:08 గంటలకు మంత్రి తుమ్మల, 12:53 గంటలకు మరో మంత్రి పొంగులేటి, 2:14 గంటలకు డిప్యూటీ సీఎం భట్టి హాజరయ్యారు. అప్పటికే అసహనం, ఆకలితో ఉన్న అన్నదాతలకు ఆ సమయంలో భోజనమూ అందించలేదు. దీంతో ఆకలితో అలమటిస్తున్న రైతులు ఒక్కసారిగా భోజనాల కోసం టెంట్ల వైపు వెళ్లారు. కానీ భోజనాలు వడ్డించేందుకు ఇంకా అనుమతి రాలేదని, పర్మిషన్ వస్తేనే భోజనాలు వడ్డిస్తామని క్యాటరింగ్ సిబ్బంది తేల్చిచెప్పారు. దీంతో రైతులు మండిపడ్డారు. 'మధ్యాహ్నం 2 గంటల వరకు భోజనాల కోసం పడిగాపులు కాయాలా? వేళకు భోజనం చేయకుంటే బీపీ, షుగర్ ఉన్న రైతుల పరిస్థితి ఏంటి?' అంటూ భోజన పేట్లను విసిరేశారు. దీంతో అక్కడ తీవ్ర వాగ్వాదం, ఘర్షణ వాతావరణం చోటుచేసుకున్నాయి. పోలీసులు జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించినా రైతులు పట్టించుకోలేదు. 'పండుగ రోజు ఏంటి మాకు ఈ పరీక్ష? గత్యంతరం లేక ఈ సమావేశానికి వచ్చామా? పండుగ రోజున కుటుంబాలతో ఉండనీయకుండా, సమావేశం పేరిట భోజనాలు కూడా అందించకుండా ఎందుకు పిలిచారు?' అంటూ ఆక్రోశం వెలిబుచ్చారు. దీంతో పరిస్థితి చేయి దాటిపోతోందని గ్రహించిన మంత్రులు, ఎమ్మెల్యే.. 'భోజనాల తర్వాత సమావేశం కొనసాగిద్దాం' అంటూ ప్రకటించారు. అప్పటికే చాలామంది రైతులు ఇంటి బాట పట్టారు. భోజనాల తరువాత మిగతా రైతులూ బయటకు వెళ్లిపోయారు. దీంతో సభా ప్రాంగణమంతా ఖాళీ అయింది. ఇంతలో వర్షం కూడా ఊపందుకోవడంతో రైతులు, అధికారులు నానా ఇబ్బందులు పడ్డారు. అయితే రైతులు లేక సభ వెలవెలబోయినప్పటికీ ఖాళీ కుర్చీలకే మంత్రులు ప్రసంగాలు వినిపించి సభను ముగించారు.

20 వేల మెగా వాల్ట్స్ సహరిత విద్యుత్: భట్టి

సహజ వనరులను వినియోగిస్తూ రాబోయే ఆరేళ్లలో 20 వేల మెగా వాల్ట్స్ హరిత విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇందుకోసం న్యూ ఎనర్జీ పాలసీని తీసుకొస్తామని చెప్పారు. స్థానిక ఆయిల్‌పాం ఫ్యాక్టరీలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. రూ.2 లక్షలపైన ఉన్న రైతులకు కూడా త్వరలోనే రుణమాఫీ చేస్తామని అన్నారు.

రూ.20 వేల మద్దతు ధర అందిస్తాం: తుమ్మల

ఆయిల్‌పాం రైతులకు టన్ను గెలలకు కనీస మద్దతు ధర రూ.20 వేలు అందిస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆయిల్‌పాం సాగుకు పుట్టినిల్లు అశ్వారావుపేట నియోజకవర్గమేనన్నారు. గిట్టుబాటు ధర కోసం పక్క రాష్ట్రాలైన ఏపీ, కర్ణాటకలతో కలిసి కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. అవసరమయ్యే పోరాటానికి రైతులకు కూడా సహకరించాలని కోరారు.

ఆయిల్‌పాం సాగుదే భవిష్యత్: పొంగులేటి

రాష్ట్రంలో ఆయిల్‌పాం సాగుకే మంచి భవిష్యత్ ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆయిల్‌పాం సాగులో దేశంలోకెల్లా తెలంగాణే మొదటి స్థానంలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అడవుల పునరుద్ధరణకు ఆయిల్‌పాం సాగు దోహదపడుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ బలరాంనాయక్, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రాఘవరెడ్డి, ఎండీ యాస్మిన్ బాషా, రాష్ట్ర ఉన్నతాధికారి రఘునందన్‌రావు, కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఇతర అధికారులు సరోజనీదేవి, ఎంవీ మదుసూధన్, బాబూరావు, బీఎన్ రావు, రాజశేఖర్, హేమంత్‌కుమార్, ఆయిల్‌పాం రైతు సంఘం నేతలు ఆలపాటి రామచంద్రప్రసాద్, వీర రాఘవరావు, పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా డెయిరీ ఆదర్శం కావాలి

- **ఎస్‌హెచ్‌జీల మహిళలు వ్యాపారవేత్తలుగా రాణించాలి**
- **పాల శీతలీకరణ కేంద్రం ప్రారంభంలో డిప్యూటీ సీఎం**

పాల శీతలీకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

ఎర్రుపాలెం, అక్టోబర్ 13: రానున్న రోజుల్లో ఇందిరా మహిళా డెయిరీ విజయవంతమై దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఎర్రుపాలెం మండలం కేంద్రంలో పాలశీతలీకరణ కేంద్రం, ఇందిరా మహిళా డెయిరీ యూనిట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ.. ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటుతో నియోజకవర్గంలోని స్వయం సహాయ సంఘాల మహిళా సభ్యులను వ్యాపారవేత్తలుగా తయారు చేయబోతున్నామని అన్నారు. మహిళలతో కోఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసి ఇందిరా మహిళా డెయిరీను చాలా పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. పాల ఉత్పత్తి, సేకరణ, విక్రయాల ద్వారా వచ్చే ప్రతి పైసా మహిళా సభ్యులకే చెందే విధంగా ప్రాజెక్టులు రూపకల్పన చేశామని వివరించారు. నియోజకవర్గంలో ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు ప్రభుత్వం రెండు గేదెలను పంపిణీ చేస్తుందన్నారు. 2010లో ఈ ప్రాజెక్టు గురించి ఆలోచన చేశానని, 2011-12 సంవత్సరంలో ఈ ప్రాజెక్టును ప్రజల ముందుకు తీసుకొచ్చానని అన్నారు. సమాజాన్ని గొప్పగా నడిపించే విధంగా మహిళలు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న కేటీఆర్, పక్కన మాజీ ఎమ్మెల్యే సండ్ర

నూతన వధూవరులను ఆశీర్వదించిన కేటీఆర్, హరీశ్

సత్తుపల్లి, అక్టోబర్ 13: సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కుమారుడు భార్గవ్ వివాహం సిద్దిపేటసాయితో హైదరాబాద్ శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ఈ వివాహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వీరితో పాటు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తాతా మధు, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కూడా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

నెల రోజులైనా పోస్టింగ్‌లు రాకపాయె..

మరి వారి విధులు ఎక్కడ? వేతనాలు ఎక్కడి నుంచి?

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): ఐసీడీఎస్‌లో పదోన్నతులు లొల్లి ఇంకా కొలిక్కిరాలేదు. సీడీపీవోలకు డీడబ్ల్యూవోలుగా పదోన్నతులు వచ్చి నెల రోజులైనా వారికి పోస్టింగ్‌లు ఇవ్వకపోవడంతో ఆ అధికారులు ఆందోళన చెందుతున్నారు. నెల రోజుల పాటు వారు ఎక్కడా జాయిన్ కాని అంశంపై ఆ శాఖలో చర్చ జరుగుతోంది. ఏ శాఖలోనైనా బదిలీలు అయితే ప్రయాణం కోసం రెండు మూడు రోజులు వెసులుబాటు ఇస్తారు. కానీ నెల రోజుల సమయం మాత్రం ఉండదు. కానీ భద్రాద్రి జిల్లాలో ఇద్దరు సీడీపీవోలకు డడబ్ల్యూవోలుగా పదోన్నతులు వచ్చినప్పటికీ వారికి ఇప్పటికీ పోస్టింగ్‌లు ఇవ్వకపోవడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

పదోన్నతులు వచ్చి నెల కావస్తున్నా..

పదోన్నతులు పొందిన ఆ ఇద్దరు అధికారిణులు ఆ ఉత్తర్వులు పట్టుకొని మంత్రులు, ఉన్నతాధికారులు వద్దకు తిరిగినప్పటికీ పోస్టింగ్‌లు రాలేదు. దీంతో వారు సెక్రటేరియట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మంత్రుల పైరవీలతో విసిగిపోయిన ఉన్నతాధికారులు కేవలం భద్రాద్రి జిల్లాలో ఉన్న ఇద్దరు అధికారిణులను మాత్రమే పక్కకు పెట్టి మిగతా వారికి పోస్టింగ్‌లు ఇచ్చేశారు. అయితే, గత నెల 11న పదోన్నతులు వచ్చిన ఆ ఇద్దరు అధికారిణులకు నేటికీ పోస్టింగ్‌లు ఇవ్వకపోవడంతో వారు గాల్లో ఉన్నట్లుగా పరిగణించాల్సి వస్తుందని పలువురు అధికారులు అభిప్రాయపడుతున్నారు. కాగా, వారికి ఏ స్టేషన్ నుంచి వేతనాలు చెల్లిస్తారో కూడా అంతుపట్టని ప్రశ్నగా మిగిలింది.

ఉత్తర్వులు జారీ చేసిన అధికారి ఏపీకి..

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సెక్రటరీగా ఉన్న ఐఏఎస్ అధికారిని తాజాగా కేంద్ర ప్రభుత్వం ఏపీకి కేటాయించడంతో పదోన్నతులు ఫైల్ మళ్లీ మొదటికే వస్తుందని వాదనలు వినిపిస్తున్నాయి. 'ఆ సెక్రటరీ ఏపీకి వెళ్లకముందే వీరి పదోన్నతుల పోస్టింగ్‌లు వస్తాయా? లేక కొత్త సెక్రటరీ వచ్చాక పోస్టింగ్‌లు వస్తాయా?' అనే అంశంపై ఆ శాఖలో ఇప్పుడు చర్చ జరుగుతోంది.